

# ‘అదే’ కథలు

### – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 72

## లిమరెన్స్

**నలభై ఏళ్ళ శంకర్రావుకి** బుర్ర వేడెక్కి రోజూ వారీ పనులు పాడౌతూంటే ఆఫీసులో పనిచేసే తెల్లాయనకి తన గోడు వెళ్లబోసుకున్నాడు. చూచాయగా ఇదీ పరిస్థితి. ఎన్నో ఏళ్ళ క్రితం ఒకానొకపుడు ఇండియాలో కల్పన అనే ఒక అమ్మాయిని ప్రేమించాడు. కానీ అనేకానేక కారణాల వల్ల ఆవిడ కనిపిస్తే నవ్వుతూ మాట్లాడినా, ప్రేమిస్తున్నా అని చెప్పడానికి ధైర్యం చాలలేదు. ఆవిడకి తాను నచ్చడేమో, శంకరం ఇంట్లో డబ్బుల స్థితి చూస్తే పెళ్ళి చేసుకునే స్తోమత లేదు మిగతా అప్పులు తీరేదాకా. ఈ రంధి ముదిరి కొన్నాళ్ళకి కల్పన ఆఫీసులో కనిపించకపోతే విలవిల్లాడే స్థితికి వచ్చినా నోరెత్తడానికి మొహం చెల్లలేదు. ఆవిడ, ‘నువ్వా, నన్నా, ప్రేమిస్తున్నావా? ఎప్పుడైనా మొహం అద్దంలో చూసుకున్నావా?’ అనేస్తుందని భయం. అయినా కల్పన ‘ఓ బకరా గాడు నాకేసి అలా చూస్తూ ఉంటాడేం’, అనుకుంటే? కల్పన కీ శంకరానికీ మధ్యవర్తులు ఎవరూ లేరు. అలా ఏం చేయాలో, కూడదో అనే స్థితిలో, కల్పనకి వేరే ఉద్యోగం వచ్చి కనుమరుగైంది. ఆ తర్వాత ఓ సారి వచ్చింది ఆఫీసుకి ఏవో కాయితాల కోసం; కూడా మరొకావిడ, మరొకాయనా ఉన్నారు. కల్పన కి కానీ పెళ్ళైపోయిందా ఆయనతో? కల్పన మెడలో మంగళ సూత్రం కనిపిస్తూందేమో చూడాలంటే ఆవిడ

శరీరం కేసి చూసేస్తున్నాడని అనుకుంటే? ఏమీ తేల్చుకోలేక కళ్ళు మూసుకుని, భగవంతుడా నన్ను ఈ ఆలోచనల నరకంలోంచి తప్పించు అనుకుంటూ బాత్రూం లోకి దూరాడు. బయటకి వచ్చేసరికి ఆవిడ వెళ్ళిపోయింది. తర్వాత మరెప్పుడూ కల్పన ని చూడకపోయినా ఆవిడ మాత్రం శంకరం మనస్సులో శాశ్వతంగా గూడుకట్టుకుని, తిష్ట వేసుకుని కూర్చుంది. ఈ సంగతి శంకరానికి తప్ప మరొకరికి తెలియదు. చెప్పుకోలేని అగ్ని పర్వతం కదా.

ఆఫీసులో తెల్లాయనకి తెల్సిన ఒక చర్చ్ ఫాదర్ ఉన్నాట్ట. వెళ్ళి మనసులో ఉన్నది చెప్పుకోవచ్చు. మరీ అంత ఘోరంగా ఉంటే తర్వాత సైకాలజిస్ట్ ని కలవొచ్చు. అలా శంకరం ఫాదర్ దగ్గిర తేలాడు. శంకరం ఏదీ దాచకుండా అన్నీ చెప్పాడు – ఇప్పటికీ కల్పన ఎక్కడుందో, ఆవిడ ఏం చేస్తోందో, ఫేస్ బుక్ మీద కనిపిస్తుందేమోననీ ఆశ చావడం లేదు. ఒక్కోసారి ఇండియా వెళ్తుంటే మధ్యలో జర్మనీ లోనో, నెదర్లాండ్స్ ఎయిర్ పోర్ట్ లోనో కనిపిస్తుందనీ, పలకరించి తన కూడా ఉన్న తన కూతుర్ని పరిచయం చేస్తే ' చూసావా, నువ్వు మొదట్లో నాతో మాట్లాడి ఉంటే ఈ అమ్మాయి నా కూతురు అయి ఉండేది' అని తాను సమాధానం చెప్తాడనీ బుర్రలో తొలుస్తూ ఉంటుంది. లేకపోతే బండి నడుపుతున్నప్పుడు ఏ ట్రాఫిక్ లైట్ దగ్గిరో పక్క లేన్ లో ఉన్న కార్ లో కల్పన కనిపిస్తుందనీ వెంటనే ఆగి తామిద్దరూ ప్రస్తుతం ఎంత బాధగా వేరే వాళ్ళతో తప్పని సరి సంసారం లాగుతున్నారో తనివితీరా మాట్లాడుకోవాలనీ ఉంటుంది. ఇవీ శంకరం ఆలోచనలు. రోజూ ఈ నరకం ఎవరికీ చెప్పుకోలేకా, అనుభవించలేకా ఛస్తున్నాడు. భార్యా పిల్లలకి చెప్తే ఇన్నేళ్ళొచ్చి ఇదా వీడు చేసేపని అనుకుంటారని భయం. లేదా నిజంగా కల్పన కనిపించాక శంకరం తన మనసులో విషయం చెప్తే, 'నువ్వు ఇంత దరిద్రుడివా?' అంటూ ఆవిడ చీదరించుకుంటుందని మరో భయం. పోనీ ఆవిడ ఇండియాలోనే ఉందనుకుని వెళ్ళి ఆరా తీస్తే ఆవిడకి పెళ్ళి అవలేదనీ తనకోసమే చూస్తోందనీ ఆశ. మరో కోణంలో ఆవిడ ఈ పాటికే అమ్మమ్మ అయి ఉంటుందేమో – నువ్వెవరివో నాకు గుర్తు లేదు అంటుందేమో అని మరో శంక. ఇలా బుర్ర తినే ఆలోచనలతో ఆరోగ్యం దెబ్బ తింటుందేమో అని భయం.

అన్నీ విన్న చర్చ్ ఫాదర్ చెప్పాడు. "ఆవిడ ఎక్కడ ఉంది అనేది ఫేస్ బుక్ లో కానీ మరోచోట కానీ ఎప్పుడూ చూడవద్దు. ఇప్పుడు మీకు పెళ్ళై పిల్లలు ఉన్నారు. ఒకసారి ఆవిడతో కాంటాక్ట్ వస్తే మీ జీవితం సర్వనాశనం అవడానికి అది మొదటి మెట్టు. ఆవిడ గురించి ఆలోచన వచ్చినప్పుడల్లా మరో విషయం ఆలోచించడానికి ప్రయత్నం చేయండి – బైబిల్, లేదా మీ మతం పుస్తకం – దాని పేరు ఏమిటి, భగవద్గీత, చదవండి. లేకపోతే అలా బయటకి నడిచి ఆవిడని కాంటాక్ట్ చేస్తే జీవితం ఎలా మారుతుందో ఉన్న పరువూ, మిగిలినదంతా ఎలా పోగొట్టుకుంటారో ఊహించండి. కొన్నాళ్ళు ఇలా చేసాక ఇది పనిచేయకపోతే సైకాలజిస్ట్ దగ్గిరకి వెళ్ళండి."

అలా ఫాదర్ సలహా సంపాదించి శంకరం బయటకొచ్చాడు. కొన్నాళ్ళు ఆయన చెప్పినట్టు చేసాక మెల్లిగా ఆ సలహా మర్చిపోయాడు. అయితే కొన్నాళ్ళకి మరోసారి ఉద్ధృతంగా కల్పన గురించి ఆలోచనలు దాడి చేశాయి. మనసులో

పడిన ఇటువంటి విత్తనం ఏనాటికీ నాశనం అవదు. ఎప్పటికప్పుడు ప్రయత్నం చేస్తూ ఉండాల్సిందే ఫాదర్ చెప్పినట్టూ. ఫాదర్ దాకా ఎందుగ్గానీ ఏనాడో మన కృష్ణుడే భగవద్గీత లో చెప్పలేదుటండీ? మనసు త్వరగా కంట్రోల్ లో పెట్టగలిగితే ఇంకేం?

మరోసారి ఫాదర్ దగ్గిరకి వెళ్ళడానికి మనసొప్పక ఈ సారి సైకాలజిస్ట్ దగ్గిరకి వెళ్ళాడు. సైకాలజిస్ట్ చెప్పాడు అంతా విని – “ఈ పరిస్థితిని లిమరెన్స్ అంటారు. ఎవరో తనకూడా ఉంటే బాగుంటుందనుకోవడం వాళ్లతో ఉంటే ఇలా, అలా జరుగుతుందనుకోవడం, వాళ్ళని మర్చిపోలేకపోవడం వగైరా. ఫాదర్ చెప్పినట్టూ అలా అభ్యాసం చేస్తూ ఉండాల్సిందే. ఒకప్పుడు శంకరం మనసులో తిష్ట వేసుకున్న కల్పన అందమైన రూపం ఇప్పుడు అలాగే ఉండదు కదా పదిహేనేళ్ల తర్వాత. ఒక అమ్మాయి/అబ్బాయి మొహం పదీ పదిహేనేళ్ళలో మారిపోతుంది, ఈ మార్పు వల్ల మొదట్లో ఉన్న వ్యామోహం ఇప్పుడు ఉండదు” అంటూ కంప్యూటర్ మీద సిములేట్ చేసి చూపించాడు సైకాలజిస్ట్. మరో విషయం ఏమిటంటే ఒకసారి ఇద్దరు మనుషులు దగ్గిరయ్యాక కలతలు రావడం సాధారణం – ఆకర్షణ వేరు, కలిసి ఉండడం వేరు. కల్పనని ఆఫీసులో తప్ప ఎక్కడా కలుసుకోలేదు శంకరం; కల్పన గురించి అన్ని విషయాలు తెలియవు శంకరానికి; అన్నింటికన్నా జీర్ణించుకోలేని నిజం జరిగి ఉండొచ్చు. కల్పన బతికి ఉందో లేదో? బతికి ఉంటే అసలు ఆవిడకి శంకర్రావు ఎవడో గుర్తున్నాడా? అందువల్ల ఇవన్నీ మర్చిపోవాలి తప్ప జీవితాంతం అవి పదేపదే గుర్తు తెచ్చుకోవడం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. “ఎప్పుడూ ఆవిడని కలవడానికి ప్రయత్నం చేయవద్దు. అది దేనికి దారితీస్తుందో ఎవరూ చెప్పలేరు. లిమరెన్స్ అనేదానికి మందు మీ లోనే ఉంది. నిద్ర పట్టక పోతే మాత్ర ఇస్తారు కానీ లిమరెన్స్ అనేదానికి నిజంగా మాత్రం మన మనసే. థెరపీ ప్రయత్నం చేయండి; మనసులోంచి అవిణ్ణి తుడిచేసే ప్రయత్నాలు వాళ్ళు కొన్ని చెప్తారు తప్ప ఏ మాజిక్ మందూ ఇవ్వలేరు.”

డాక్టర్ దగ్గిర్నుంచి వెనక్కి వచ్చిన శంకర్రావుకి ఓ కోరిక మొదలైంది. కల్పన నిజంగా చచ్చిపోయిందా? ఇండియా వెళ్ళి చూసి వస్తే పోలే? బతికుంటే తన ప్రేమ గురించి చెప్పేసి, ఆవిడ ‘ఛీ ఫో’ అంటే వెనక్కి వచ్చేయవచ్చు. భార్యా పిల్లలకి ఎవరికీ చెప్పక్కర్లేదు. అందుకే ఏదో పని ఉన్నట్టు చూచాయగా చెప్పి ఇండియా బయల్దేరాడు. మొదటగా చూడాల్సింది బెంగుళూర్, అక్కడ తాను పనిచేసిన ఆఫీస్. ఆ ఆఫీసులో ఇంకా ఒకరిద్దరు తనతో పనిచేసిన వాళ్ళున్నారు. వాళ్ళ ప్రకారం కల్పన హైద్రాబాద్ వెళ్ళిపోయింది. ఫలానా కంపెనీలో చేరుతున్నారని చెప్పారు కానీ అది కొన్నేళ్ళ క్రితం. హైద్రాబాద్ వెళ్ళి కనుక్కుంటే ఆవిడ ఎనిమిదేళ్ళ క్రితం జర్మనీ వెళ్ళి వచ్చాక మరో కంపెనీకి మారారని తెలిసింది. ఆ మరో కంపెనీకి దారి చూసుకుంటూ వెళ్తే కల్పన శెలవులో ఉంది; ఇల్లు గచ్చి బౌలి అనేచోట అని తెల్సింది. సాయంత్రం ఆటో తీసుకుని అక్కడకి వెళ్ళాడు. కల్పనని దూరంనుంచి చూసి తర్వాత ఇంట్లోకి వెళ్దాం అనుకున్నాడు కానీ ఎవరూ కనిపించక కాసేపటికి ఆ ఇంట్లోకి వెళ్ళి తలుపు కొట్టాడు. కల్పనే తలుపు తీసింది. భూతం ఆవహించినవాడు ఏదో లోకంలో ఉన్నట్టూ ఆవిడ దగ్గిరకి

వెళ్ళి కావలించుకూంటూ 'కల్పనా నిన్ను ఎంత మిస్ అయ్యానో ఇప్పటివరకూ!' అనేసరికి ఆవిడ వళ్ళు దాచుకుంటూ కేకలు పెట్టింది. మరో గంటకి శంకరం లోకల్ జైల్లో ఉన్నాడంటే దానిక్కారణం కల్పన మొగుడు ఇచ్చిన కంప్లైంట్. హైద్రాబాద్ పోలీసులు బడితపూజ చేసాక శంకరానికి తెలివొచ్చింది. ఆ తర్వాత వచ్చిన పోలీస్ ఆఫీసర్ మిగతావి పూర్తి చేసాడు. కన్ను లొట్టబోయి మళ్ళీ అమెరికా వచ్చేసరికి ఈ విషయాలన్నీ అమ్మగారికి తెలిసాయి పేపర్లో వచ్చిన వార్తల ద్వారా. ఇంటర్నెట్టా మజాకా?

రెండో సారి సైకాలజిస్ట్ దగ్గిర తేలినపుడు అమ్మగారు వచ్చింది శంకర్ కూడా. డాక్టర్ చెప్పాడు – "నేను కల్పనని మరో సారి కలవవద్దు అని చెప్పాను కదా? ఇటువంటి గొడవలు సర్వసాధారణంగా జరుగుతాయి మరోసారి కలిసి ఏదైనా చేద్దామనుకుంటే. అది అతి తెలివి తక్కువ పని. థెరపీ తీసుకుంటూ మీ వ్యాపకాలు చూసుకుంటూ, లేదా కొత్త వ్యాపకాలు కల్పించుకుని, గతం మర్చిపోవడం ఒకటే దీనికి మందు. వెళ్ళి రండి." బయటకి వచ్చాక శంకరం అమ్మగారి చేతులు పట్టుకుని చెప్పాడు, "దయచేసి ఇవన్నీ ఎవరికీ చెప్పకు." కుటుంబం మీద మచ్చ పడకుండా వుండడానికి ఏ అమ్మగారికైనా తెల్సినంత, తెలివి తక్కువ అయ్యగారికి ఎప్పుడూ తెలీదు కదా? అందుకే అమ్మగారు అనునయంగానే అంది, "సరే, అయినా చెప్పడానికేముంది? ఇప్పటికే అందదరూ న్యూస్ లో చూసారు. నోరు మూసు కోవడం ఒకటే మనం చేయగలిగింది."

నీతి: ఆసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలం, అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే (గీత 6.35)

Post your comments